నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్ ఆదివారం 6 అక్టోబర్ 2024 | ADILABAD NIRMAL


# వీసీపై ఆరోపణలను ఖండిస్తున్నాం..

## ట్రిపుల్ ఐటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ సంఘం



మాట్లాడుతున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు

బాసర, అక్టోబర్ 5 : ట్రిపుల్ ఐటీ వీసీ వెంకటరమణపై ఆరోపణలతో ఓ కరపత్రం సోషల్ మీడియాలో వైరల్ అయిన దృష్ట్యా ఆ ఆరోపణలను ఖండిస్తున్నామని ట్రిపుల్ ఐటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్స్ సంఘం పేర్కొంది. శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. నిరాధారమైన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కొందరు స్వార్థపూరిత ప్రయోజనకాల కోసం ఇటువంటి ఆరోపణలు చేయడం దురదృష్టకరమని మండిపడ్డారు. యూనివర్సిటీ అభివృద్ధికి వీసీ అహర్నిశలు శ్రమిస్తున్నారని అన్నారు.

# ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టవద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్, అక్టోబర్ 5(నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపట్టవద్దని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా ఓ ప్రకటనలో సూచించారు. ప్రైవేటు స్థలాల్లో ఇండ్లు నిర్మించుకునే వారు రెవెన్యూ, మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపట్టినా, ప్రైవేటు స్థలాల యజమానులు అనుమతులు తీసుకోకున్నా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంద్రవెల్లి మార్కెట్ యార్డును అనుకుని ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మించిన ఇంటితోపాటు ప్రైవేటు స్థలంలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాలకు రెవెన్యూ, పోలీసు, పంచాయతీ అధికారులు పరిశీలించి నోటీసులు జారీ చేశారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నందున కూల్చివేసినట్లు తెలిపారు.



సోయ కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

# రైతులను ఇబ్బందులకు గురి చేయద్దు

ఇచ్చోడ, అక్టోబర్ 5 : సోయా పంటను విక్రయించేందుకు మార్కెట్ యార్డుకు వచ్చే రైతులను ఇబ్బందులకు గురి చేయవద్దని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో సోయా కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం తేమ పేరిట ఇబ్బందులకు గురి చేయవద్దని, దళారులను ప్రోత్సహించకుండా పేద రైతులను అండగా నిలవాలని సూచించారు. మార్కెట్ యార్డులో నీళ్లు, భోజన వసతి కల్పించాలని సూచించారు.

### రోడ్డు పనుల పరిశీలన

మండల కేంద్రంలో జరుగుతున్న ప్రధాన రోడ్డు పనులను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పరిశీలించారు. పనులను వేగవంతం పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ ప్రీతం రెడ్డి ఉన్నారు.



ముక్రా(కే) మాజీ సర్పంచ్‌ను అభినందిస్తున్న శార్ప్ సెక్రటరీ దివ్య దేవరాజన్

# ప్రతి పల్లె స్వయం సమృద్ధి బాటలో పయనించాలి

ఇచ్చోడ, అక్టోబర్ 5 : ముక్రా(కే) గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రతి పల్లె స్వయం సమృద్ధి బాటలో పయనించాలని పంచాయతీ రాజ్ కమిషనర్ అనిత రామచంద్రన్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని స్టేట్ ఫైనాన్స్ కమిషన్ వారు ఐడియాథోన్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో గ్రామాలు ఏ విధంగా అభివృద్ధి చెందితే స్వయం సమృద్ధి బాటలో వెళ్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో 1100 మంది పాల్గొన్నారు. ఈ రోజు ముక్రా(కే) గ్రామం చెత్త ద్వారా ఆదాయాన్ని సంపాదిస్తూ, సోలార్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి, ఇంకుడు గుంతలతో గ్రౌండ్ వాటర్ పెరగడం, ముక్రా(కే) స్వయం సమృద్ధి బాటలో వెళ్లడం అద్భుతమని ప్రతి గ్రామం ముక్రా(కే) లాగా అభివృద్ధి జరిగేలా చూస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ముక్రా(కే) మాజీ సర్పంచ్ గాడ్గె మీనాక్షి, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య, శార్ప్ సెక్రటరీ దివ్య దేవరాజన్, ఫైనాన్స్ కమిషన్ సెక్రటరీ స్మిత సబర్వాల్, ఎంపీటీసీ గాడ్గె సుభాష్ పాల్గొన్నారు.



వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

# సంక్షేమానికి కృషి చేశారు

ఎదులాపురం, అక్టోబర్ 5 : పేదలతోపాటు కార్మికుల సంక్షేమానికి కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి కృషి చేశారని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో కాకా జయంతిని అధికారికంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ శ్యామలదేవితో కలిసి కాకా చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడుతూ శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఏవో రామిరెడ్డి ఉన్నారు.

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 5 : కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతిని శనివారం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి అధికారికంగా జయంతి ఉత్సవాలు నిర్వహించారు. సీపీవో జీవరత్నం, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, సంక్షేమ శాఖ అధికారులు రాజేశ్వర్‌గౌడ్, శ్రీనివాస్, అంబాజీ, శంకర్‌లు వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

# 'అడెల్లి' జాతరకు భక్తులు సహకరించాలి

## గోదావరి వద్ద ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ జానకి షర్మిల

దిలావర్‌పూర్ అక్టోబర్ 5 : అడెల్లి(గంగానీళ్ల) అమ్మవారి జాతరకు భక్తులు సహకరించాలని ఎస్పీ జానకి షర్మిల సూచించారు. శనివారం సాంగ్వీలో గోదావరి వద్ద బస, అమ్మవారి నగల అభిషేక ఏర్పాట్లను ఆమె పర్యవేక్షించారు. ఏర్పాట్ల గురించి గ్రామస్తులు, పోలీసులను అడిగారు. అంతకుముందు పోచమ్మ ఆలయాన్ని పరిశీలించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు, భక్తులు, పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం 4 గంటలకు అమ్మవారి నగలకు అభిషేకం చేసేటప్పుడు భక్తులు భారీ సంఖ్యలో తరలి రావద్దని, తమ పోలీసు సిబ్బందికి సహకరించాలని కోరారు. అమ్మవారి నగల శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో శాంతి యుతంగా నిర్వహించుకోవాలని తెలిపారు. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి అమ్మవారి నగల మూటపై వేయవద్దని సూచించారు. కార్యక్రమంలో నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.



సాంగ్వీలో గోదావరి వద్ద ఏర్పాట్లపై ఆరా తీస్తున్న ఎస్పీ జానకి షర్మిల

# వేకువ జామున.. రెండిండ్లు నేలమట్టం

**ప్రభుత్వ స్థలంలో నిర్మించుకున్నారని అధికారుల దౌర్జన్యం**

- శనివారం వేకువజామున జేసీబీతో కూల్చివేత
- పోలీసు బందోబస్తు మధ్య కూల్చిన ప్రభుత్వ యంత్రాంగం
- గ్రామ పంచాయతీ ఎదుట బైఠాయించిన లబ్ధిదారులు, గిరిజనేతరులు
- ఇండ్లు కూల్చిన పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ హామీతో ఆందోళన విరమణ



అనుమతి లేదని కూల్చగా మిగిలిన ఇంటి గోడలు, పిల్లర్లు



గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ప్రధాన రోడ్డుపై ధర్నా చేపడుతున్న గిరిజనేతరులు

ఇంద్రవెల్లి, అక్టోబర్ 5 : ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు అనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ఇంటితోపాటు మండల కేంద్రంలో అనుమతి లేకుండా నిర్మిస్తున్న మరో ఇంటిని అధికారులు కూల్చివేశారు. ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు శనివారం వేకువజామున రెవెన్యూ, ఇంద్రవెల్లి గ్రామ పంచాయతీ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య జేసీబీ సాయంతో నేలమట్టం చేశారు. దీంతో ఇండ్లు కూలిన లబ్ధిదారులతో పాటు మండలంలోని అన్ని రాజకీయ పార్టీలకు చెందిన గిరిజనేతర నాయకులు, గిరిజనేతరులు ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఆందోళన నిర్వహించారు. ఇంద్రవెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ప్రధాన రోడ్డుపై బైఠాయించి రెండు గంటలపాటు రాస్తారోకో చేపట్టారు. ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్‌తోపాటు ఉట్నూర్, ఇచ్చోడ సీఐలు మొగలి, భీమేష్, ఇంద్రవెల్లి ఎస్ఐ సునీల్, గుడిహత్నూర్ ఎస్ఐ ఇమ్రాన్‌లు ఆందోళనకారులను నచ్చజెప్పినా వినిపించుకోలేదు. ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవాలని అధికారులు చెబితే వెళ్లిపోతామని గిరిజనేతరులు పేర్కొన్నారు. ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ ఆందోళనకారుల వద్దకు వచ్చి గిరిజనేతరుల నాయకులతోపాటు గిరిజనేతరులతో గ్రామ పంచాయతీ కార్యాలయంలో చర్చించి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు గిరిజనేతర నాయకులు మాట్లాడుతూ.. ఇంద్రవెల్లి పంచాయతీ అధికారులతోపాటు ఇతర మండలాలకు చెందిన వారు ఏజెన్సీలో ఇండ్ల నిర్మాణం చేయరాదని బెదిరిస్తూ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఇంద్రవెల్లి గ్రామ పంచాయతీ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించిన సబ్ కలెక్టర్.. అధికారులపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో ఎవరైనా డబ్బులు అడిగిన వారిపై కూడా ఫిర్యాదు చేస్తే కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. ఆయన హామీతో గిరిజనేతరులు ఆందోళన విరమించారు.



సబ్ కలెక్టర్ యురాజ్ మర్మాట్‌కు సమస్యలను వివరిస్తున్న గిరిజనేతర నాయకులు

### అనుమతి లేదని కూలగొట్టారు..



మండల కేంద్రంలో నిర్మిస్తున్న నా ఇల్లుకు అనుమతి లేదని గ్రామ పంచాయతీ అధికారులు కూల్చివేశారు. దీంతో నాకు రూ.2 లక్షల వరకు ఆర్థిక నష్టం జరిగింది. నిర్మాణం చేసేందుకు గ్రామ పంచాయతీ అధికారులు రశీదు కూడా ఇచ్చారు. దీంతో నేను ఇల్లు నిర్మాణ పనులు ప్రారంభించా. ఇప్పుడేమి చేయాలనో అర్థం కావడం లేదు. - సాబ్లే శ్యాంరావ్, బాధితుడు.



ప్రధాన రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న గిరిజనేతరులతో మాట్లాడుతున్న సీఐలు, ఎస్ఐలు

### గిరిజనేతరులకు రక్షణ కల్పించాలి..



ఏజెన్సీలో 1/70 చట్టం రాక ముందు నుంచి నివాసం ఉంటున్న ఏజెన్సీ గిరిజనేతరులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి. మాకు ఆదివాసీ గిరిజనులతో ఎలాంటి విభేదాలు లేవు. గిరిజనేతరులు కొత్త ఇండ్లు నిర్మిస్తుంటే ఇతర ప్రాంతాలకు చెందిన కొందరు మా వద్దకు వచ్చి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. పేదలకు చెందిన ఇళ్లను ప్రభుత్వం కూల్చడం సరికాదు. ఏజెన్సీలోని గిరిజనేతరులకు ప్రభుత్వాలు కేవలం ఓట్ల కోసమే వాడుకుని మా సమస్యలను పట్టించుకోవడం లేదు. - సంజయ్ లహనే, ఇంద్రవెల్లి.

### నా ఇల్లును కూల్చేశారు..



నేను వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డుకు అనుకుని ఉన్న స్థలంలో ఇంటి నిర్మాణం చేపడుతున్నా. అది ప్రభుత్వ స్థలంలో ఉందని నా ఇల్లును అధికారులు కూల్చివేశారు. దీంతో ఇప్పుడు నాకు ఉండేందుకు ఇల్లు లేకుండా పోయింది. దీంతో నాకు దాదాపు రూ.15 లక్షల ఆర్థిక నష్టం జరిగింది. - సోన్‌కాంబ్లే దేవిదాస్, బాధితుడు.

### మూడు పిడిల నుంచి ఇక్కడే ఉంటున్నాం..



వ్యవసాయ మార్కెట్ యార్డుకు అనుకుని ఉన్న స్థలంలోనే ఇల్లు నిర్మించుకుని ఉండబట్టి దాదాపు మూడు పిడిలు అవుతున్నది. ఇందులోనే ఉంటున్నాం. కానీ.. మాకు తెలియదు. ఇది ప్రభుత్వ భూమని. పంచాయతీ అధికారులు నోటీసు ఇస్తేనే మాకు తెలిసింది. మా ఇళ్లు ఎప్పుడు కుల్చివేస్తారో తెలియదు. - కాంబ్లే భారత్, బాధితుడు.

### నోటీసులు ఇచ్చారు..



నేను దాదాపు 80 ఏళ్ల నుంచి ఇక్కడే నివాసం ఉంటున్నా. ఇది ప్రభుత్వ భూమి ఉందని మాకు తెలియదు. గ్రామ పంచాయతీ అధికారులు వచ్చి సర్వేలు చేశారు. ఇది ప్రభుత్వ స్థలం ఉందని మాకు నోటీసు జారీ చేశారు. మా ఇల్లు ఎప్పుడు కూల్చివేస్తారో తెలియని పరిస్థితి ఉంది. - ప్రకాశ్, బాధితుడు.



శుక్రవారం అధికారులు సీజ్ చేసిన బోటు



శనివారం ఉదయం సీజ్ చేసిన ప్రదేశంలో కనిపించని బోటు

# తెగించిన అక్రమార్కులు

**● రాత్రి సీజ్ చేసిన వాహనాలు మాయం ● సాయంత్రం వాహనాలు తిరిగి ప్రత్యక్షం ● ఫిర్యాదు సమాచారంపై అనుమానాలు**

ఆదిలాబాద్, అక్టోబర్ 5(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో ఇసుక అక్రమార్కుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతున్నది. బేల మండలంలోని కాంగార్‌పూర్‌లో గల పెన్‌గంగా నదిలో పడవల ద్వారా ఇసుక వెలికితీస్తూ అక్రమ రవాణాకు పాల్పడుతున్న దందాపై శుక్రవారం 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. మైనింగ్ ఏడీ రవీందర్, బేల తహసీల్దార్ రఘునాథ్ రావు, పోలీసులు పెన్‌గంగ నుంచి ఇసుకను వెలికితీస్తున్న మూడు బోట్లు, మూడు జేసీబీలు, రెండు టిప్పర్లు, 12 ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేశారు. సీజ్ చేసిన వాహనాలను ఏవరైనా తీసుకుపోతే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రఘునాథ్ రావు విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

### రాత్రి మాయం.. సాయంత్రం ప్రత్యక్షం..

శుక్రవారం ఇసుక అక్రమ రవాణాకు ఉపయోగించే వాహనాలను సీజ్ చేసిన బేల రెవెన్యూ అధికారులు శనివారం వాటిని పరిశీలించడానికి రాగా కనిపించలేదు. శుక్రవారం రాత్రి అక్రమార్కులు రెండు జేసీబీలు, ఒక బోటు, మరో టిప్పర్‌ను అక్కడి నుంచి తీసుకెళ్లారు. సీజన్ చేసిన వాహనాలను తరలించిన వారిపై చర్యలు తీసుకోవాలంటా రెవెన్యూ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారనే విషయాన్ని తెలుసుకున్న ఇసుక రవాణాదారులు శనివారం సాయంత్రం వాహనాలను తిరిగి కాంగార్‌పూర్ పెన్‌గంగా నది సమీపంలో తరలించారు. రెవెన్యూ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారనే విషయం వారికి ఎలా తెలిసిందనే విషయం పలు అనుమానాలకు తావిస్తున్నది.



సీజ్ చేసిన టిప్పర్‌ను తరలించకుండా పెయింట్‌తో రాస్తున్న రెవెన్యూ సిబ్బంది

# అట్టహాసంగా గంగనీళ్ల జాతర

**● గోదావరి తీరానికి అమ్మవారి నగలు ● గ్రామాల్లో ఘన స్వాగతం**



అమ్మవారి నగల వెంట భక్తులు

సారంగాపూర్, అక్టోబర్ 5 : మండలంలోని శ్రీ మహా అడెల్లి పోచమ్మ దేవస్థానం గంగానీళ్ల జాతర శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. అడెల్లి గ్రామం నుంచి అమ్మవారి నగలను డప్పుచప్పుళ్లతో తీసుకుని బాలాయమం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆలయ అర్చకుడు శ్రీనివాస్ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు హారతి అందించారు. బాలాయమం నుంచి పోచమ్మ అమ్మవారి నగలను గంగాస్నానం కోసం అడెల్లి, సారంగాపూర్, యాకర్‌పల్లి, ప్యారమూర్, బీరవెల్లి గ్రామాల మీదుగా వెళ్లి.. దిలావర్‌పూర్ మండలంలోని మాటేగాం, కంజర్, సాంగ్వి గ్రామానికి చేరుకుంది. అయితే గ్రామాల్లో అమ్మవారి నగలకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. పోచమ్మ తల్లీ సల్లంగా చూడు తల్లీ భక్తులు మొక్కలు చెల్లించుకున్నారు. ఆదివారం ఉదయం సాంగ్వి గ్రామసమీపంలో ఉన్న గోదావరిలో అమ్మవారి నగలకు పుణ్యస్నానాలు చేయించి తిరిగి ఇదే గ్రామాల గూండా ఆలయానికి చేరుకుంటుంది. అమ్మవారి నగల వెంట ఎలాంటి గొడవలు జరుగకుండా ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## గంగమ్మ చెంతకు అమ్మవారి నగలు

దిలావర్‌పూర్, అక్టోబర్ 5 : శనివారం అమ్మవారి నగలు అడెల్లి ఆలయం నుంచి దిలావర్‌పూర్ మండలంలోని సాంగ్వీలో గల పోచమ్మ ఆలయం వద్ద గల గోదావరి చెంతకు చేరాయి. ఈ సందర్భంగా మాడెగాం, దిలావర్‌పూర్, బన్సపల్లీ, మాయపూర్ గ్రామాల్లోని భక్తులు పూజలు నిర్వహించారు. రాత్రి వరకు సాంగ్వీ గోదావరి తీరంకు చేరుకున్నాయి. రాత్రి అక్కడే బస చేసి ఉదయం నగల మూటకు వేలాది మంది భక్తజనం మధ్య అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా దారి పొడువు దిలావర్‌పూర్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.